# నులి పురుగులను నిర్మూలిద్దాం..

## ప్రోగ్రాం జిల్లా ఆఫీసర్ బాషా



సమావేశంలో పాల్గొన్న జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ ఉన్నూరు బాషా

వెల్దుర్తి: జాతీయ నులి పురుగుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బత్తిన శ్రీరాం ఆధ్వర్యంలో మండాది అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆల్‌బెండాజోల్ మాత్రలను వేయించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ ఉన్నూరు బాషా మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులి పురుగులను నిర్మూలిద్దాం అనే పద్ధతిలో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సున్న పిల్లలందరికీ నులిపురుగు మాత్రలను వేయించటం జరిగిందన్నారు. పోషకాహారలోపం, రక్తహీనత లోపం, శారీరక, మానసిక అభివృద్ధిలో మందకొడిగా ఉంటారన్నారు. అందువలన పిల్లల ఎదుగుదలకు ఆల్‌బెండ్‌జోల్ మాత్రలు తప్పక వేయాలన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా స్టేట్ ఆఫీసర్ స్టెఫీగ్రేస్ మండాదిలోని అంగన్ వాడీ 2ను సందర్శించి ఎన్‌డీటీ కార్యక్రమాన్ని పరిశీలించారు.

**ఎంపీడీఓ ఆధ్వర్యంలో..**

మండల కేంద్రమైన వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, శిరిగిరిపాడు పీహెచ్‌సీ పరిధిలోని అన్నీ అంగన్‌వాడీ పాఠశాలల్లో జాతీయ నులి పురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆల్‌బెండ్‌జోల్ మాత్రలు వేయటం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ప్రసాద్, ఎంపీపీ అలుగుమల్లి సంజీవరెడ్డి మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యం కోసం ప్రతి ఒక్క విద్యార్థి ఆల్‌బెండ్‌జోల్ మాత్రలు వేసుకోవాలన్నారు.

**నులి పురుగుల నివారణతో సంపూర్ణ ఆరోగ్యం**

నులి పురుగుల నివారణతోనే సంపూర్ణ ఆరోగ్యమని కరాలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు కె.ప్రవీణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని కామేపల్లి, తుమ్మలచెరువు, బ్రాహ్మణపల్లి, పెద అగ్రహారం, చెన్నాయిపాలెం, వీరాపురం తదితర గ్రామాల్లో పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

- పిడుగురాళ్లరూరల్

**కారెంపూడి మండలంలో...**

కారెంపూడి: జాతీయ నులి పురుగుల నివారణా దినోత్సవం సందర్భంగా మంగళవారం నులి పురుగుల నివారణ కోసం ఆల్‌బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం మండల వ్యాప్తంగా మంగళవారం నిర్వహించారు. కారెంపూడి పీహెచ్‌సీ పరిధిలో మొత్తం 8,669 మందికి మాత్రలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుని 7,802 మందికి ఇవ్వడం జరిగిందని పీహెచ్‌సీ సూపర్ వైజర్ మల్లయ్య తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, పీహెచ్‌సీ డాక్టర్లు రమ్య, లక్ష్మీ మౌనిక పాల్గొన్నారు. గాదెవారిపల్లె పీహెచ్‌సీ పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈఓ రవికుమార్ పాల్గొన్నారు.

**మాచవరం మండలంలో..**

మాచవరం: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఆల్‌బెండాజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.ప్రసాదరావు తెలిపారు. మాచవరం సెక్టార్ పరిధిలో 5623 మంది విద్యార్థులకు, పిల్లుట్ల సెక్టార్ పరిధిలో 2348 మంది విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేసినట్లు తెలిపారు. మిగిలిన విద్యార్థులకు ఈనెల 20న పంపిణీ చేస్తామని చెప్పారు.



వెల్దుర్తి జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థినులకు మాత్రలు వేస్తున్న ఎంపీడీఓ ప్రసాద్



విద్యార్థినికి మాత్ర ఇస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్



కామేపల్లి స్కూల్‌లో విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

## క్లుప్తంగా

### హర్ ఘర్ తిరంగా ర్యాలీ

మాచర్ల: హర్ ఘర్ తిరంగా ర్యాలీ మంగళవారం నిర్వహించారు. పురపాలక సంఘ కమిషనర్ డి వేణుబాబు ఆధ్వర్యంలో భారీ స్థాయిలో ర్యాలీ నిర్వహించారు. ఉదయం జెండాలు చేతపట్టి నినాదాలు చేస్తూ భారత్ మాతకు జై అంటూ ప్రజలు ర్యాలీలో పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు భారీ స్థాయిలో భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని వివరిస్తూ ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో పురపాలక సంఘ అధికారులు, మెప్మా ప్రాజెక్టు అధికారులు, ఆర్‌పిలు వివిధ శాఖలకు చెందిన పురపాలక సంఘ అధికారులు భారీ స్థాయిలో పాల్గొన్నారు.

### చెస్ పోటీల్లో మాచర్ల విద్యార్థుల ప్రతిభ



మాచర్ల రూరల్: రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో మాచర్లకు చెందిన పల్నాడు చెస్ అకాడమీ విద్యార్థులు సత్తా చాటి పలు బహుమతులు సాధించారు. మంగళవారం గుంటూరులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో రాష్ట్ర ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్ నిర్వహించారు. ఇందులో అండర్ 6లో జాషువా మ్యాగ్నస్, అండర్ 10లో మేఘశ్రీ కోమలి, నీల్ ప్రజ్ఞన్, ధన్విన్, కేదార్ అద్వా, అండర్ 12లో సాత్విక్, లాలిత్య, అక్షయ, అండర్ 14లో శాన్లీ మోజెస్, హేమత్రవి, అండర్ 16లో భార్గవ్ శ్రీనివాస్ నాయక్‌లు పతకాలు సాధించినట్లు అకాడమీ కోచ్ కె. కిరణ్ తెలిపారు. విద్యార్థులను ఆయన అభినందించారు.

### పశువులకు విద్యుదాఘాతం

శావల్యాపురం: సీతారామస్వామిదేవస్థానం ప్రతిష్టా సందర్భంగా గ్రామంలో స్వామివారిపేరుతో వదలిన అంబోతు,దూడ రెండూ విద్యుత్ షాక్‌కుగురై మృత్యువాతపడ్డాయి. మండలంలోని కారుమంచిగ్రామం దేవస్థానానికిచెందిన ఎద్దు దూడ గ్రామ సమీపంలోని పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మరు వద్ద విద్యుత్ తీగలు తగలటంతో రెండు అక్కడిక్కడే మృతిచెందాయి. సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు ఆలయ కమిటీ సభ్యులు, సంప్రదాయం ప్రకారం పూజ లు చేసి గ్రామంలో ఊరేగింపు నిర్వహించి ఖననం చేశారు.

### కంప్యూటర్ ప్రింటర్ కొనుగోలుకు ఆర్థికసాయం

వినుకొండ: పట్టణంలోని ఎస్ఎస్‌పీ కాలనీలో గల జడ్పీ హైస్కూల్‌కు కంప్యూటర్ ప్రింటర్ కొనుగోలు నిమిత్తం రూ.15వేలు విశ్రాంత ఉపాధ్యాయులు గాండ్లమూల నాగేంద్రుడు అందజేసినట్లు పాఠశాల హెచ్ఎం సీహెచ్. వీరప్పయ్య తెలిపారు. కొత్తగా హైస్కూల్ ఏర్పడినందున పాఠశాలకు మౌలిక వసతులు ఆవశ్యకత ఉన్నాయని తెలపడంతో ఆర్థికసాయం చేసిన దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం దాత నాగేంద్రుడు మాట్లాడుతూ తన తల్లిదండ్రులు సుబ్బయ్య, చెంచమ్మల పేరు మీద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రైమరీ స్కూల్ హెచ్ఎం ఎస్.పద్మజ, పాఠశాల పీడీ ఆర్. రాధాకృష్ణమూర్తి, గోవింద్‌నాయక్, రామాంజనేయులు, ఎలీషా పాల్గొన్నారు.

### తాళ్లపల్లి కుడికాలువ వద్ద హెచ్చరిక బోర్డులు



విజయపురిసౌత్: నాగార్జునసాగర్– తాళ్లపల్లి కుడి కాలువ బ్రిడ్జి వద్ద మంగళవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. పలువురు పర్యాటకులు మరియు చుట్టుపక్కల గ్రామస్థులు అక్కడికి వచ్చి కాలువ లోకి దిగి స్నానాలు చేస్తూ ప్రమాదవశాత్తు మృత్యువాత పడుతున్నారు. ఈ మేరకు విజయపురిసౌత్ ఎస్ఐ అశోక్ ఆ ప్రాంతంలో జరిగే ప్రమాదాలపై దృష్టి సారించి భద్రత చర్యలు చేపట్టారు. ఏఎస్ఐ సోమయ్య ఫ్లెక్సీలతో పాటు అండర్ సీసీ టీవీ పర్యవేక్షణ సర్వేలైన్స్ కెమెరాలు ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఇది ప్రమాదాలు జరుగు స్థలం, కుడికాలువలోకి దిగి ఈత కొట్ట రాదని ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అనంతరం సీసీ కెమెరాల పనితీరును పర్యవేక్షించారు.

### ఘనంగా రంగనాథన్ జయంతి

నరసరావుపేట ఈస్ట్: ఆధునిక గ్రంథాలయ ఉద్యమ పితామహుడు ఏ.ఎస్.ఆర్.రంగనాథన్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం ఆంధ్ర చైతన్య గ్రూప్, శ్రీనాథ సాహితీ పరిషత్ ఆధ్వర్యంలో పల్నాడురోడ్డులోని శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని నిర్వహించారు. రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ, గణిత శాస్త్రవేత్తగా పేరుపొందిన రంగనాథన్ లైబ్రరీ సైన్స్‌లో కొలోన్ క్లాసిఫికేషన్ సిస్టం ను రూపొందించి గ్రంథాలయల అభివృద్ధిలో కృషి చేశారని కొనియాడారు.

# ర్యాగింగ్ చట్టపరమైన నేరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ భాస్కర్

దాచేపల్లి: ర్యాగింగ్ చట్టరీత్యా నేరమని దాచేపల్లి సీఐ భాస్కర్ పేర్కొన్నారు. నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్- మాదకద్రవ్యాలపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ భాస్కర్ మాట్లాడుతూ.. ర్యాగింగ్ చేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాదకద్రవ్యాల వినియోగం ఆరోగ్యంతో పాటుగా సమాజంపై తీవ్ర ప్రభావం చూపిస్తాయని, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు పాపారావు, సౌందర్యరాజన్, ప్రిన్సిపాల్ టీ జయచంద్రశేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# తప్పిపోయిన చిన్నారి ఆచూకీ గుర్తింపు

## రెండు గంటల్లోనే కనుగొన్న పోలీసులు



మాట్లాడుతున్న సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు

సత్తెనపల్లి: తప్పిపోయిన చిన్నారిని రెండు గంటల్లోనూ పోలీసులు గుర్తించి, కన్నవారికి అప్పగించారు. సత్తెనపల్లి పోలీసులు తెలిపిన వివరాల మేరకు... పట్టణంలోని నాగన్నకుంటకు చెందిన దేవర గురవయ్య కుమార్తె నీలిమ (3) మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఇంటి ముందు పిల్లలతో ఆడుకుంటూ అదృశ్యమైంది. తల్లిదండ్రులు పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి విషయం చెప్పారు. టౌన్ సీఐ నరహరి నాగమల్లేశ్వరరావు వెంటనే స్పందించారు. డ్రోన్ సహాయంతో కానిస్టేబులు, మరో మూడు బృందాలతో పట్టణాన్ని జల్లెడ పట్టారు. సాయంత్రం 4.30 గంటల సమయంలో నీలిమ ఏడుస్తూ 20వ వార్డులో కనిపించటంతో ఓవ్యక్తి స్థానిక అంగన్‌వాడీ కేంద్రానికి పంపారు. ఈలోగా పోలీసులు వెళ్లి నీలిమను డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించారు. పట్టణంలోని తన కార్యాలయంలో డీఎస్పీ మాట్లాడుతూ చిన్న పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పట్టణ సీఐ, ఎస్ఐ పవన్ కుమార్, ఇతర సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

## ఇద్దరు చిన్నారుల సహా మరొకరికి తీవ్ర గాయాలు



శ్రీనివాసరావు మృతదేహం



గాయపడిన కేతావత్ బాలు నాయక్

వెల్దుర్తి: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనటంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. మరో వ్యక్తికి, ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని మండాది, బోదిలవీడు మధ్య మంగళవారం జరిగింది. బోదిలవీడుకు చెందిన బి.శ్రీనివాసరావు(50), మాచర్ల నుంచి బోదిలవీడు గ్రామానికి బైకుపై వెళ్తున్నాడు. కొత్తపుల్లారెడ్డిగూడేనికి చెందిన కేతావత్ బాలు నాయక్ అలియాస్ యర్ర బాలు నాయక్, కేతావత్ సృజన, కేతావత్ హర్షితలు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం.. శ్రీనివాసరావు బైకు వేగంగా ఢీకొట్టుకున్నాయి. దీంతో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ముగ్గురికి గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నర్సరావుపేట ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు వెల్దుర్తి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. శ్రీనివాసరావుకు భార్య లక్ష్మీ, కుమార్తె లక్ష్మీ చైతన్య ఉన్నారు.

# పోలీస్ సిబ్బందికి అండగా ఉంటాం

- అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) జేవీ సంతోష్
- హెడ్‌కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం



హెడ్‌కానిస్టేబుల్ సతీమణి తేజస్వికి సాయం చెక్‌ను అందజేస్తున్న అడిషనల్ ఎస్పీ సంతోష్

నరసరావుపేట రూరల్: నిరంతరం ప్రజా రక్షణకై పాటుపడే పోలీస్ సిబ్బందికి అండగా ఉంటామని అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) జేవీ సంతోష్ తెలిపారు. మాచవరం పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన కె.రమేష్‌బాబు కుటుంబ సభ్యులకు పోలీస్ అసోసియేషన్ నుంచి రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సంతోష్ మృతుడు రమేష్‌బాబు సతీమణి తేజస్వికి సాయం చెక్‌ను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు టి.మాణిక్యాలరావు పాల్గొన్నారు.

# ర్యాగింగ్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న వెంకటరమణ

నరసరావుపేట రూరల్: ర్యాగింగ్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలని మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ, నరసరావుపేట ఇన్‌చార్జి డీఎస్పీ ఎం.వెంకటరమణ తెలిపారు. నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో ర్యాగింగ్ నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడితే జీవితాలు నాశనమవుతాయని తెలిపారు. ర్యాగింగ్ పేరుతో వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ర్యాగింగ్ చిన్నదైన అందులోని సెక్షన్లు, శిక్షలు కఠినంగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో రూరల్ సీఐ పి.రామకృష్ణ, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ కేపి సుబాషిణి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీల్ పాల్గొన్నారు.

# ఉద్యోగులకు మధ్యంతర భృతి ప్రకటించాలి

## చిలకలూరిపేట ఆర్టీసీ డిపోలో ఎన్ఎంయూఏ ధర్నా



చిలకలూరిపేట టౌన్: ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఎన్ఎంయూఏ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చిలకలూరిపేట డిపో వద్ద రెండు రోజుల ధర్నా కార్యక్రమం ప్రారంభమైంది. మంగళవారం డిపో వద్ద జరిగిన ధర్నాలో ఏఎంయూఏ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు తమ ప్రధాన డిమాండ్లను తెలియజేశారు. ఐఆర్ (ఐఖ) వెంటనే ప్రకటించాలని, ఉద్యోగులకు తక్షణమే మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీకి చెందిన స్థలాలను లీజుకు ఇవ్వడాన్ని వెంటనే ఆపివేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ఉద్యోగులకు ఎంప్లాయ్ హెల్త్ స్కీం పూర్తిస్థాయిలో అమలు జరిగేలా చూడాలని కోరారు. అలాగే ఉద్యోగులకు రావాల్సిన నాలుగు డియర్‌నెస్ అలవెన్స్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మహిళా కండక్టర్లు ఎదుర్కొంటున్న ప్రత్యేక సమస్యలతో పాటు గ్యారేజ్‌లో ఉన్న అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తామని ఎన్ఎంయూఏ నాయకులు స్పష్టం చేశారు.

### ఉన్నత పాఠశాలల పరిశీలన

బొల్లాపల్లి: సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు మండలంలోని రావులాపురం, రేమిడిచర్ల, జడ్పీ హైస్కూల్స్, ఏపీ మోడల్‌స్కూల్‌ను మంగళవారం సందర్శించారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్రులకు సంబంధించిన అథెంటికేషన్‌ను పరిశీలించారు. బడి బయట పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. రెగ్యులర్ స్కూల్స్ లో చేరని విద్యార్థులను ఓపెన్ స్కూల్లో చేర్పించాలన్నారు. పెండింగ్‌త్వరగా పూర్తి చేయాలన్నారు. సెక్టోరియల్ అధికారులు ఏ పీ ఓ పద్మారావు, ఏఎస్ శంకర రాజు,ఏ ఎల్ సి కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఎం ఈ ఓ 2 కె పార్వతి తదితరులు ఉన్నారు

### ఆయిల్‌ఫాం సాగుకు విస్తారంగా ప్రోత్సాహకాలు



నాదెండ్ల: ఆయిల్‌ఫాం సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుందని చిలకలూరిపేట ఉద్యానవన శాఖ అధికారి ఆర్ శ్రీలక్ష్మి చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామంలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఆయిల్‌పాం మెగా ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెక్టార్ భూమిలో ఆయిల్‌పామ్ సాగుకు 150 మొక్కలను నూరుశాతం రాయితీపై ప్రభుత్వం అందిస్తుందన్నారు. అంతర్‌సాగు ప్రోత్సాహకంలో భాగంగా హెక్టార్‌కు నాలుగేళ్ళపాటూ రూ.21 వేల చొప్పున అందిస్తున్నట్లు తెలిపారు. బిందు సేద్యం ద్వారా ఆయిల్‌ఫాం సాగు చేయాలన్నారు. ఆయిల్ సాగు విస్తీర్ణం పెరిగేలా ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తున్నదని పేర్కొన్నారు.